క్లుప్తంగా

ఎమ్మెల్యే మద్దిశెట్టిని కలిసిన డీఎస్పీ



ఎమ్మెల్యే మద్దిశెట్టితో డీఎస్పీ అశోక్‌వర్ధన్

దర్శి టౌన్: ఎమ్మెల్యే డాక్టర్ మద్దిశెట్టి వేణుగోపాల్‌ను సోమవారం దర్శి డీఎస్పీ అశోక్‌వర్ధన్ రెడ్డి మర్యాద పూర్వకంగా కలిశారు. డీఎస్పీగా బాధ్యతలు చేపట్టిన తర్వాత ఆయన ఎమ్మెల్యేను కలిసి డివిజన్ పరిధిలో సమస్యలపై చర్చించారు. సీఐ రామకోటయ్య, ఎస్‌ఐ రామకృష్ణ, రాష్ట్ర గ్రీనింగ్ అండ్ బ్యుటిఫికేషన్ డైరెక్టర్ కుమ్మిత అంజిరెడ్డి, కౌన్సిలర్ వీసీ రెడ్డి ఉన్నారు.

కేరళ స్టోరీ సినిమాను నిషేధించాలి

మార్కాపురం: అవాస్తవాలను సినిమాగా తీసిన కేరళ స్టోరిని రాష్ట్రంలో నిషేధించాలని ఎంపిజే (మూవ్‌మెంట్ ఫర్ పీస్ అండ్ జస్టిస్) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి షేక్ అబ్దుల్ రజాక్, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రసూల్ కోరారు. ఈ మేరకు సోమవారం స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయ సిబ్బందికి వినతి పత్రం అందజేశారు. మత సామరస్యం దెబ్బతినేలా తీసిన కేరళ స్టోరీ సినిమాకు కేంద్ర ప్రభుత్వం వెన్నుదన్నుగా ఉండడం సిగ్గుచేటని విమర్శించారు. కార్యక్రమంలో పట్టణ కన్వీనర్ షేక్ అమీర్ భాషా, నాయకులు మహబూబ్ ఖాన్, గౌస్ భాషా, నాగూర్ మీరావలీ, అయూబ్‌ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

నేడు మార్కాపురంలో గడప గడపకు మన ప్రభుత్వం

మార్కాపురం: పట్టణంలోని 2వ బ్లాక్ పరిధి ఏకలవ్య కాలనీలోని శాంతి నగర్ నుంచి ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి ఆధ్వర్యంలో మంగళవారం సాయంత్రం 4 గంటలకు గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు పట్టణ వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు, మున్సిపల్ వైస్‌చైర్మన్ షేక్ ఇస్మాయిల్ తెలిపారు. మున్సిపల్ చైర్మన్, కమిషనర్‌తోపాటు ఇతర అధికారులు హాజరవుతారని, కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యులు, సచివాలయ కన్వీనర్లు, వలంటీర్లు, గృహసారథులు, వార్డు కమిటీ ప్రతినిధులు పాల్గొనాలని సోమవారం ఓ ప్రకటనలో కోరారు.

ఘర్షణలో ఇద్దరికి గాయాలు

బేస్తవారిపేట: బాకీ విషయమై రెండు కుటుంబాల మధ్య తలెత్తిన వివాదంలో ఇద్దరికి గాయాలైన సంఘటన మండలంలోని కోనపల్లె గ్రామంలో సోమవారం రాత్రి చోటుచేసుకుంది. వివరాలు.. కోనపల్లెకు చెందిన శివరాం, తిరుమలనాథం ఇద్దరు సమీప బంధువులు. ఆదివారం వీరిద్దరు కోనపల్లెలోని ఓ గృహంలో మద్యం సేవించారు. ఈ సందర్భంగా శివరాం తన తల్లి పీరాంబీకి ఇవ్వాల్సిన రూ.90 వేల డబ్బు ఎప్పుడిస్తావని తిరుమలనాథంను ప్రశ్నించాడు. ఇద్దరి మధ్య మాటామాటా పెరగడంతో ఘర్షణకు దిగారు. దీంతో శివరాంపై కక్ష పెంచుకున్న తిరుమలనాథం సోమవారం శింగరపల్లె నుంచి తన బంధువు మరొకరిని తీసుకుని శివరాం ఇంటికి వెళ్లాడు. శివరాంను కర్రతో కొట్టడంతో చెయ్యి విరిగింది. అడ్డు వచ్చిన భార్య లక్ష్మి, కూతురుకు స్వల్ప గాయాలయ్యాయి. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై మాధవరావు తెలిపారు.

వలంటీర్ల సేవలు భేష్

- ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి
- వలంటీర్లకు పురస్కారాలు ప్రదానం



సన్మానాలు అందుకున్న వలంటీర్లతో ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి, ఇతర నాయకులు

తర్లుపాడు: ప్రజా సేవలో వలంటీర్ల సేవలు అద్భుతమని ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి పేర్కొన్నారు. సోమవారం తర్లుపాడులోని ఐసీడీఎస్ కార్యాలయం ఆవరణలో మండలంలోని వలంటీర్లకు సేవామిత్ర, సేవారత్న, సేవావజ్ర పురస్కారాలు అందజేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ..ప్రజలకు, ప్రభుత్వానికి మధ్య వారధిగా ఉంటూ సేవలందించేందుకు వలంటీర్ వ్యవస్థను సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఏర్పాటు చేశారన్నారు. సంక్షేమ పథకాలకు అర్హుల ఎంపిక బాధ్యతను సక్రమంగా నిర్వర్తిస్తున్న వలంటీర్లను అభినందించారు. సొంత గ్రామంలోనే సుమారు 600 రకాల సేవలు అందిస్తున్న గ్రామ సచివాలయ వ్యవస్థ దేశంలో ఒక్క ఆంధ్రప్రదేశ్‌లో మాత్రమే ఉండటం గర్వకారణమన్నారు. గత టీడీపీ పాలనలో పథకాలు అందక ప్రజలు అనేక ఇబ్బందులు ఎదుర్కొన్నారన్నారు. గతంలో ఏ పని కావాలన్నా మండల కేంద్రానికి వెళ్లాల్సి వచ్చేదని, నేడు సచివాలయంలోనే పనుల వుతున్నాయని చెప్పారు. తద్వారా ప్రజలకు విలువైన సమయం, డబ్బు ఆదా అవుతోందన్నారు. అవార్డు గ్రహీతలను ఎమ్మెల్యే, అధికారులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఎంపీపీ భూలక్ష్మి రామసుబ్బారెడ్డి, ఎంపీడీఓ ఎస్.నరసింహులు, వెలుగు ఏపీఎం పిచ్చయ్య, పంచాయతీ సెక్రటరీలు, జేసీఎస్ కన్వీనర్ రామాంజనేయరెడ్డి, సొసైటీ ప్రెసిడెంట్ కె.సత్యనారాయణరెడ్డి, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

పుల్లలచెరువు: విధి నిర్వహణలో ప్రతిభ చూపిన గ్రామ వలంటీర్లకు త్వరలో అవార్డులు ప్రదానం చేయనున్నట్లు ఎంపీడీవో రాజ్యలక్ష్మి సోమవారం తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన సేవారత్న అవార్డుకు నవీన్‌కుమార్(మల్లాపాలెం), పెద్దపోతురాజు (ఐటీవరం), బాజిబాబు(మానేపల్లి), వెంకటరెడ్డి (కొమరోలు), అనీల్‌కుమార్ (గంగవరం) ఎంపికయ్యారన్నారు. వారికి రూ.20 వేలు చొప్పున రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్ చేతుల మీదగా త్వరలో అందజేస్తామని ఎంపీడీవో పేర్కొన్నారు.

వాడీవేడిగా సర్వసభ్య సమావేశం

- అధికారుల తీరుపై ప్రజాప్రతినిధుల ఆగ్రహం
- సమస్యలు పరిష్కరించనప్పుడు సమావేశాలెందుకని ప్రశ్న



ఎంపీడీఓను నిలదీస్తున్న జెడ్పీటీసీ ఏడుకొండలు

కొనకనమిట్ల: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం ఎంపీపీ మోరబోయిన మురళీకృష్ణ యాదవ్ అధ్యక్షతన ఏర్పాటు చేసిన సర్వసభ్య సమావేశం వాడీవేడిగా సాగింది. గత సమావేశంలో తెలియజేసిన సమస్యలను అధికారులు పరిష్కరించకపోవడంపై ప్రజాప్రతినిధులు ఆగ్రహం వ్యక్తం చేశారు. సమస్యలను పరిష్కరించకపోతే ఇక సమావేశాలెందుకని అధికారులను జెడ్పీటీసీ అక్కిదాసరి ఏడుకొండలు, వద్దిమడుగు సర్పంచ్ పిన్నిక పిచ్చయ్య, ఎంపీటీసీ చక్కెర వెలుగొండయ్య నిలదీశారు. ఒకదశలో ఎంపీడీఓ జనార్దన్, జెడ్పీటీసీ ఏడుకొండలు మధ్య వాగ్వివాదం చోటుచేసుకుంది. గ్రామ సచివాలయాల్లో ఉద్యోగులు, పంచాయతీ కార్యదర్శులు సమస్యలపై స్పందించటం లేదని సభ్యులు ఆరోపించారు. అధికారులు కూడా అంతే నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని పలువురు సభ్యులు తప్పుబట్టారు. రెవెన్యూ సమస్యలు, నాడు-నేడు పనులు, విద్యాశాఖ, విద్యుత్ శాఖలకు సంబంధించిన సమస్యలు పరిష్కరించకపోవడంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. వేసవి దృష్ట్యా తాగునీటి ఎద్దడి లేకుండా చర్యలు చేపట్టాలని సూచించారు. ఎంపీపీ మాట్లాడుతూ.. ప్రజా సంక్షేమమే లక్ష్యంగా అధికారులు పని చేసి ప్రభుత్వానికి మంచి పేరు తీసుకురావాలన్నారు. ఆర్‌డబ్ల్యూఎస్, వ్యవసాయం, పశుసంవర్ధకశాఖ, విద్య, వైద్యం, హౌసింగ్, ఉపాధి, వైఎస్సార్ క్రాంతి పథం, ఐసీడీఎస్ శాఖల పురోగతిని అధికారులు నారాయణస్వామి, ప్రసన్న రంగలక్ష్మి, డాక్టర్ బాలయ్య, శ్రీకాంత్‌రెడ్డి, దాంగేష రీఫ్, బుల్లయ్య, గోపాలకృష్ణారెడ్డి, సుధామాలతి వివరించారు. సమావేశంలో తహసీల్దార్ కె.ప్రవీణ్ కుమార్, కార్యాలయ పర్యవేక్షకులు శ్రీనివాసరావు, సొసైటీ చైర్మన్ కామసాని వెంకటేశ్వరరెడ్డి, కోఆప్షన్ సభ్యుడు వలి, స్థానిక ఎంపీటీసీ కల్లం దిబ్బమ్మ సుబ్బారెడ్డి, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో గంగమ్మ తిరునాళ్ల



ప్రత్యేక అలంకరణలో గంగమ్మతల్లి



పొంగళ్లతో ఆలయ ప్రదక్షిణ చేస్తున్న మహిళలు

పొదిలి రూరల్: మండలంలోని బుచ్చనపాలెం సమీపంలో కొలువై ఉన్న ముక్కుడు గంగమ్మతల్లి ఆలయ తిరునాళ్ల సోమవారం వైభవంగా నిర్వహించారు. అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి, క్షీరాభిషేకం చేశారు. కొత్తపల్లి, బుచ్చన్నపాలెం, కొస్టాలపల్లి గ్రామాలకు చెందిన భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. మహిళలు పొంగళ్లతో ఆలయానికి చేరుకుని అమ్మవారికి నైవేద్యంగా సమర్పించారు. రాత్రికి విద్యుత్ ప్రభపై సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు.

ఉత్సాహంగా ఎడ్ల పందేలు

గంగమ్మ తిరునాళ్ల సందర్భంగా ఎడ్ల బండలాగుడు పందేలు ఉత్సాహంగా సాగాయి. పోటీల్లో ఐదు జతల ఎడ్లు పాల్గొన్నాయి. పొదిలి బాప్టిస్టుపాలేనికి చెందిన వేల్పుల రేబేన్ ఎడ్లు ప్రథమ బహుమతి రూ.10 వేలు, అదే గ్రామానికి చెందిన గంజా రవి ఎడ్లు రెండో బహుమతి రూ.10 వేలు, గంజా విజయబాబు ఎడ్లు మూడో బహుమతి రూ.5 వేలు, చల్లావారిపాలేనికి చెందిన యరగొర్ల యలమంద ఎడ్లు నాలుగో బహుమతి రూ.3 వేలు, జువ్వలేరుకు చెందిన అలవల వెంకటేశ్వర్లు ఎడ్లు ఐదో బహుమతి రూ.2 వేలు గెలుపొందాయి.



మొదటి బహుమతి సాధించిన రూబెన్ ఎడ్లు

సంక్షిప్తంగా

మెడికల్ శిబిరాన్ని వినియోగించుకోవాలి



కరపత్రాలు విడుదల చేస్తున్న దేవప్రసాద్

దర్శి టౌన్: దివ్యాంగుల మెగా శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని వైఎస్సార్ సీపీ ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు జి.దేవప్రసాద్ కోరారు. స్థానిక ఆర్‌అండ్‌బీ అతిథి గృహం ఆవరణలో సోమవారం వైద్యశిబిరం పోస్టర్లను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా దేవ ప్రసాద్ మాట్లాడుతూ మార్కాపురం పట్టణంలో ఈ నెల 26న వైఎస్సార్ సీపీ కాంగ్రెస్ పార్టీ దివ్యాంగుల విభాగం జిల్లా అధ్యక్షుడు జి.గోపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో శిబిరం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. గోపాల్‌రెడ్డి మాట్లాడుతూ గత నెల 5వ తేదీన సైజులు తీసుకున్న దివ్యాంగులకు కృత్రిమ అవయవాలు పంపిణీ చేయనున్నట్లు చెప్పారు. ఇతర దివ్యాంగులు కూడా తమ పరికరాల కోసం పేర్లు నమోదు చేసుకోవాలని కోరారు. దొనకొండ, దర్శి మండల నాయకులు బ్రహ్మారెడ్డి, సుబ్బారెడ్డి పాల్గొన్నారు.

ఆరుగురు జూదరుల అరెస్టు

దర్శి టౌన్: పట్టణ శివారులో పేకాట స్థావరంపై సోమవారం ఎస్‌ఐ రామకృష్ణ తన సిబ్బందితో దాడి చేశారు. పేకాట ఆడుతున్న ఆరుగురిని అరెస్టు చేసి పోలీసుస్టేషన్‌కు తరలించారు.

నాట్యంలో శివమణికి ప్రథమ బహుమతి

దొనకొండ: పల్నాడు జిల్లా వినుకొండ పట్టణంలో కళాసాగరి ట్రస్ట్ తృతీయ వార్షికోత్సవం సందర్భంగా బాలల నాట్యం, పాటల పోటీలు ఆదివారం నిర్వహించారు. దొనకొండలోని ఒబ్బాపురానికి చెందిన డ్యాన్స్ మాస్టర్ గోపాజీ స్టీవన్ శిష్యుడు దాసరి శివమణి జాతీయ బాలల నాట్యోత్సవంలో ప్రథమ బహుమతిని కైవసం చేసుకున్నాడు. ఈ పోటీల్లో వెస్టర్న్ విభాగంలో మొత్తం 72 మంది బాలురు ఇతర ప్రాంతాల నుంచి పాల్గొనగా శివమణి ఉత్తమ ప్రతిభ కనబరచి ప్రథమ స్థానంలో నిలిచాడు. గురు శిష్యులను శాలువాలతో ఘనంగా సన్మానించి జ్ఞాపికను బహూకరించారు.

దర్శి ఎస్‌ఐపై చర్యలు తీసుకోవాలి

దర్శి టౌన్: దర్శి ఎస్‌ఐ రామకృష్ణపై చర్యలు తీసుకోవాలని దళిత, గిరిజన సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. గిరిజన మహిళ, షేక్ బాజీ ప్రేమ వ్యవహారంలో ఆయన వ్యవహరిస్తున్న తీరుపై నాయకులు ఆగ్రహం వ్యంక్తం చేశారు. డీఎస్పీ కార్యాలయం ఎదుట సోమవారం ఆందోళనకు దిగారు. బాజీ ప్రేమ వ్యవహారంతో పాటు ఎస్సీలపై ఎస్‌ఐ వ్యవహరిస్తున్న తీరు ఆందోళన కరంగా ఉందని, ఆయన అవినీతిపై విచారణ జరపాలని డిమాండ్ చేశారు. అనంతరం దర్శి డీఎస్పీ అశోక్‌వర్ధన్‌కు వినతి పత్రం అందించారు. దళిత హక్కుల పరిరక్షణ సమితి అధ్యక్షుడు నీలం నాగేంద్రం, మాల మహానాడు జిల్లా అధ్యక్షుడు దార అంజయ్య, మాదిగ సంక్షేమ సంఘ అధ్యక్షుడు సుజన్ మాదిగ, దళిత సంఘాల ఐక్యవేదిక అధ్యక్షుడు చప్పిడి వెంగళరావు, మాదిగ డప్పు కళాకారులు అధ్యక్షుడు కవల గండ్ల గోవింద్ ప్రసాద్, దళిత సేన రాష్ట్ర అధ్యక్షుడు ప్రేమ్‌కుమార్ పాల్గొన్నారు.

మాతృ భాషను మరువకూడదు



మాట్లాడుతున్న విజయలక్ష్మి

మార్కాపురం టౌన్: అన్ని భాషల కంటే మాతృ భాష గొప్పదని వ్యక్తిత్వ వికాస నిపుణురాలు కొల్లి విజయలక్ష్మి పేర్కొన్నారు. స్థానిక శాఖ గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన శిబిరంలో సోమవారం విద్యార్థులకు తెలుగు భాష ప్రాముఖ్యతను వివరించారు. అమ్మ లాంటి తెలుగు భాషను మర్చిపోకూడదని చెప్పారు. విద్యార్థులకు దేశ భక్తి గీతాలు, చెస్‌లో మెళకువలు నేర్పించారు. గ్రంథ పాలకుడు జీవీ శివారెడ్డి పాల్గొన్నారు.

పశు బీమా పథకంతో పాడి రైతులకు ఊరట

గిద్దలూరు రూరల్: పశు బీమా పథకం ద్వారా రాష్ట్రంలోని పాడి రైతులు, గొర్రెలు, మేకలు, పందుల పెంపకందారులకు ఊరట లభిస్తోందని జిల్లా పశుసంవర్ధకశాఖ అధికారిణి డాక్టర్ బేబీరాణి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. వైఎస్సార్ పశు నష్టపరిహారం పథకం స్థానంలో ఈ పథకాన్ని నూతనంగా ప్రవేశపెట్టడం జరిగిందన్నారు. పథకంలో లబ్ధిదారుని వాటా ఎస్సీ, ఎస్టీ, బీపీఎల్ లబ్ధిదారులకు 20 శాతం కాగా, ఏపీఎల్ లబ్ధిదారులకు 50 శాతంగా నిర్ణయించడం జరిగిందన్నారు. గరిష్టంగా ఒక కుటుంబానికి 5 గేదెలు, 50 గొర్రెలు, మేకలు, పందులకు పశు బీమా చేసుకోవచ్చని వివరించారు.

మల్లంపేటలో ఘనంగా ఎల్లమ్మ కొలుపులు

దొనకొండ: మండలంలోని మల్లంపేటలో సోమవారం ఎల్లమ్మ కొలుపులు ఘనంగా నిర్వహించారు. ఇంటి పేరు ఐనోలు వారు ఎల్లమ్మ తల్లిని కొలుస్తుంటారు. ఇందులో భాగంగా ఎల్లమ్మ దేవాలయాన్ని సుందరంగా అలంకరించారు. సుదూర ప్రాంతాల్లో ఉండే బంధువులు మల్లంపేట చేరుకుని ఎల్లమ్మకు మొక్కులు తీర్చుకున్నారు. చుట్టుపక్కల గ్రామాల ప్రజలు ఎల్లమ్మ కొలుపుల్లో పాల్గొన్నారు. అన్నదానం చేశారు.

అంగన్‌వాడీలకు నియామక పత్రాల అందజేత



నియామక పత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే మద్దిశెట్టి, పక్కన సీడీపీఓ భారతి

దర్శి టౌన్: అంగన్‌వాడీ టీచర్లు ప్రీ ప్రైమరీ విద్య బలోపేతానికి కృషి చెయ్యాలని ఎమ్మెల్యే డాక్టర్ మద్దిశెట్టి వేణుగోపాల్ సూచించారు. స్థానిక ఎమ్మెల్యే కార్యాలయంలో సోమవారం దర్శి ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలోని పలు కేంద్రాల్లో ఖాళీగా ఉన్న అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలకు నియామక పత్రాలు ఎమ్మెల్యే డాక్టర్ మద్దిశెట్టి వేణుగోపాల్ అందజేశారు. సీడీపీఓ సీహెచ్ భారతి, సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

వైఎస్సార్ బీమా నగదు అందజేత



నగదు అందజేస్తున్న ఇస్మాయిల్



నగదు పంపిణీ చేస్తున్న సర్పంచ్ మస్తాన్‌రెడ్డి

మార్కాపురం: పట్టణంలోని 17వ బ్లాక్‌లో అనారోగ్యంతో మృతి చెందిన నిజాముద్దీన్(40) కుటుంబానికి వైఎస్సార్ బీమా కింద మంజూరైన రూ.లక్ష నగదులో తొలి విడతగా రూ.10 వేలను సోమవారం ఆయన కుటుంబ సభ్యులకు మున్సిపల్ వైస్ చైర్మన్ షేక్ ఇస్మాయిల్ అందజేశారు. మిగిలిన నగదును త్వరలో అందిచనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో పార్టీ వార్డు అధ్యక్షుడు మస్తాన్, సచివాలయ కన్వీనర్ సీఎం కాశీం, ఆటో బాబు, ముస్తఫా, సచివాలయ సిబ్బంది నాసర్‌వలి, మహలక్ష్మి, వెంకట్ పాల్గొన్నారు.

పుల్లలచెరువు: మండలంలోని పిడికిటివానిపల్లి గ్రామానికి చెందిన లక్ష్మికి ఆమె భర్త చనిపోవడంతో వైఎస్సార్ బీమా కింద మట్టి ఖర్చుల కోసం రూ.10 వేలు సర్పంచ్ మస్తాన్‌రెడ్డి సోమవారం పంపిణీ చేశారు. గ్రామానికి చెందిన గుమ్మడి వెంకటయ్య (30) గుండెపోటుతో ఈ నెల 19వ తేదీన మృతి చెందాడు. సర్పంచ్ మస్తాన్‌రెడ్డి మాట్లాడుతూ మట్టిఖర్చుల కోసం రూ.10 వేలు ఇచ్చామని, మిగిలిన రూ.90 వేలు ప్రభుత్వం మృతుడి భార్య అకౌంట్‌కు జమ చేయనున్నట్లు పేర్కొన్నారు. వెల్ఫేర్ అసిస్టెంట్ ఆశోక్‌రెడ్డి, కార్యదర్శి మస్తాన్‌రెడ్డి పాల్గొన్నారు.

పేదలకు ఇళ్లు కట్టించడమే లక్ష్యం



లేఔట్‌లో ఎమ్మెల్యేకు ద్వారాల గురించి వివరిస్తున్న అధికారులు

దర్శి టౌన్: పేదలకు సొంత ఇళ్లు కట్టించడమే లక్ష్యంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నారని ఎమ్మెల్యే డాక్టర్ మద్దిశెట్టి వేణుగోపాల్ అన్నారు. దర్శి అర్బన్ హౌసింగ్ లేఔట్‌లో రూ.14 లక్షల వ్యయంతో నిర్మించనున్న రెండు ముఖ ద్వారాలకు ఆయన సోమవారం శంకుస్థాపన చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ రెండు లేఔట్లలో 683 మంది పేదలకు పట్టాలు పంపిణీ చేశామని, పూర్తి స్థాయి మౌలిక వసతులు ఏర్పాటు చేశామని చెప్పారు. అన్ని నివాసాలు పూర్తయితే జగనన్న కాలనీలు గ్రామాలుగా మారి ఎంతో సుందరంగా ఉంటాయని పేర్కొన్నారు. ఎంపీపీ జీఎస్ అచ్చారావు, నగర పంచాయితీ కమిషనర్ మహేష్, హౌసింగ్ డీఈ నిరీక్షణరావు, ఏఈ షాకీర్ బాషా, రాష్ట్ర గ్రీనింగ్ అండ్ బ్యుటిఫికేషన్ డైరెక్టర్ కుమ్మిత అంజిరెడ్డి, రెడ్డి సంక్షేమ సంఘ జిల్లా అధ్యక్షుడు సానికొమ్ము తిరుపతిరెడ్డి, కౌన్సిలర్ వీసీ రెడ్డి, మేడగం మోహన్‌రెడ్డి, నాయకులు దారం వాసుదేవరెడ్డి, ఎదురు శ్రీనివాసరెడ్డి, యర్రయ్య, వెంకటేశ్వర్‌రెడ్డి, మిల్లర్‌బుజ్జి పాల్గొన్నారు.

చంద్రబాబు వ్యాఖ్యలు సిగ్గుచేటు

ప్రభుత్వం అమరావతిలో పేదలకు ఇస్తున్న స్థలాలపై మాజీ సీఎం చంద్రబాబునాయుడు విషయం చిమ్ముతూ మాట్లాడటం సిగ్గుచేటని ఎమ్మెల్యే డాక్టర్ మద్దిశెట్టి వేణుగోపాల్ అన్నారు. పేదలకు ఇచ్చే స్థలంలో శవాలు పూడ్చేందుకు కూడా పనికి రావని పేర్కొనడం చంద్రబాబుకు పేదల పట్ల ఉన్న భావన తెలియజేస్తోందన్నారు. అధికారంలో ఉన్నప్పుడు ఏనాడూ పేదలకు స్థలాలు ఇవ్వని చంద్రబాబు ఇటువంటి వ్యాఖ్యలు చేయటం దురదృష్టకరమని, వీటిని తీవ్రంగా ఖడిస్తున్నట్లు చెప్పారు.

పరిపాలన వికేంద్రీకరణతో గ్రామ స్వరాజ్యం

- వలంటీర్లకు వందనం కార్యక్రమంలో ఎమ్మెల్యే డాక్టర్ మద్దిశెట్టి



ఎమ్మెల్యే నుంచి సన్మానం అందుకుంటున్న వలంటీర్

దర్శి టౌన్: పరిపాలన వికేంద్రీకరణతో గ్రామ స్వరాజ్యం సాధించవచ్చని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి భావించారని ఎమ్మెల్యే డాక్టర్ మద్దిశెట్టి వేణుగోపాల్ పేర్కొన్నారు. స్థానిక పీజీఎస్ కాంప్లెక్స్ సమావేశ మందిరంలో సోమవారం వలంటీర్లకు వందనం కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఎమ్మెల్యే డాక్టర్ మద్దిశెట్టి మాట్లాడుతూ గ్రామ స్వరాజ్య స్థాపనకు గ్రామ, సచివాలయ వ్యవస్థ తీసుకొచ్చి క్షేత్రస్థాయిలో నాలుగేళ్లుగా సేవలు అందిస్తున్నారని పేర్కొన్నారు. 50 కుటుంబాలకు అనేక వ్యవ ప్రయాసలకు ఓర్చి ఎండైనా వానైనా సేవలు అందిస్తున్నారని కొనియాడారు. వలంటీర్ల వ్యవస్థకు వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఎంతో ప్రాధాన్యం ఇచ్చిందని పేర్కొన్నారు. ప్రతి సచివాలయం పరిధిలో కార్పొరేట్ తరహా సచివాలయం, ఆర్‌బీకే, హెల్త్ క్లినిక్‌లు ఏర్పాటు చేశారని చెప్పారు. అనంతరం వలంటీర్లకు సేవారత్న, సేవామిత్ర అవార్డులు అందించి ఘనంగా సన్మానించారు. ఎంపీపీ గోళ్లపాటి సుధా అచ్చయ్య, ఏఎంసీ చైర్మన్ వైవీ సుబ్బయ్య, రాష్ట్ర గ్రీనింగ్ అండ్ బ్యుటిఫికేషన్ డైరెక్టర్ కుమ్మిత అంజిరెడ్డి, వైస్ ఎంపీపీలు సోము దుర్గారెడ్డి, కొరివి ముసలయ్య, రెడ్డి సంక్షేమ సంఘ జిల్లా అధ్యక్షుడు సానికొమ్ము తిరుపతిరెడ్డి, కౌన్సిలర్లు వీసీ రెడ్డి, మేడగం మోహన్‌రెడ్డి, జేసీఎస్ కన్వీనర్ బత్తిన వెంకటేశ్వర్లు, సర్పంచ్‌లు ఎం.వెంకటరెడ్డి, రామారావు, దాసరి నాగేశ్వరరావు, ఎంపీటీసీలు, నాయకులు దారం వాసుదేవరెడ్డి, వెంకటేశ్వర్‌రెడ్డి, యర్రయ్య, మిల్లర్ బుజ్జి, వలంటీర్ల సంఘ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్.కరుణానిధి, ఎంపీడీఓ కుసుమకుమారి, తహసీల్దార్ శ్రవణ్‌కుమార్, కమిషనర్ మహేష్ పాల్గొన్నారు.

నిస్పక్షపాతంగా రీసర్వే పూర్తి చేయాలి



సర్వే సిబ్బందితో మాట్లాడుతున్న తహసీల్దార్ నయీం అహ్మద్

ముండ్లమూరు: గ్రామాల్లో జరుగుతున్న భూరీసర్వేను నిస్పక్షపాతంగా త్వరితగతిన పూర్తి చేయాలని తహసీల్దార్ నయీం అహ్మద్ అన్నారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం రెవెన్యూ సిబ్బంది, రీసర్వే బృందాలతో ఆయన సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 12 గ్రామాల్లో రీసర్వే జరుగుతుండగా సిబ్బంది సమన్వయంతో పని చేయాలన్నారు. ప్రధానంగా రీ సర్వే సమయంలో భూమి మీద ఉన్న రైతుల వివరాలు, విస్తీర్ణం సేకరించి అనంతరం రెవెన్యూ రికార్డులు పరిశీలించాలన్నారు. రెండింటినీ పరిగణనలోకి తీసుకొని రైతులతో మాట్లాడి ఫైనల్ చేయాలన్నారు. సమావేశంలో రీ సర్వే డీటీ రవికాంత్, సర్వేయర్లు, వీఆర్వోలు పాల్గొన్నారు.

రేపు మండల సర్వసభ్య సమావేశం

రాచర్ల: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఈ నెల 24వ తేదీ మధ్యాహ్నం 2 గంటలకు మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఇన్‌చార్జి ఎంపీడీవో ఏవీ రంగనాయకులు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని సర్పంచులు, ఎంపీటీసీలు హాజరుకావాలని కోరారు. వివిధ శాఖల మండల అధికారులు పూర్తి సమాచారంతో రావాలని సూచించారు.

నేడు కొమరోలు మండలంలో ఎమ్మెల్యే అన్నా పర్యటన

కొమరోలు: గిద్దలూరు ఎమ్మెల్యే అన్నా వెంకట రాంబాబు మంగళవారం కొమరోలు మండలంలోని రాజుపాలెం గ్రామ సచివాలయం పరిధిలో గల పలు గ్రామాల్లో పర్యటించనున్నట్లు జెడ్పీటీసీ సారె వెంకటనాయుడు తెలిపారు. రౌతుపల్లి, బి.పాట్టిరెడ్డిపల్లి, రాజుపాలెం గ్రామాల్లో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొంటారని చెప్పారు. మండలంలోని వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు హాజరై విజయవంతం చేయాలని కోరారు.

జగనన్న ఆణిముత్యం విద్యార్థినికి సన్మానం

గిద్దలూరు రూరల్: కొమరోలు మండలానికి చెందిన విద్యార్థిని కె.హర్షిత పదో తరగతిలో 573 మార్కులు సాధించి జగనన్న ఆణిముత్యం అవార్డుకు ఎంపికైన సందర్భంగా సోమవారం విశ్వబ్రాహ్మణ సంఘం నాయకుడు కోటిలింగాచారి ఆధ్వర్యంలో స్థానిక కాళికాదేవి ఆలయంలో సన్మానించారు. విశ్వబ్రాహ్మణులంతా కలిసి రూ.3,500ను విద్యార్థినికి బహుమతిగా అందజేశారు.

షమీమాను అభినందించిన తహసీల్దార్

దొనకొండ: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థిని షేక్ షమీమా ఇంటర్ సీఈసీలో 938 మార్కులతో జిల్లా మొదటి ర్యాంక్ సాధించి జగనన్న ఆణిముత్యం అవార్డుకు ఎంపికైంది. ఈ సందర్భంగా స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ కాలే వెంకటేశ్వరరావు షమీమాను సన్మానించారు. భవిష్యత్తులో ఉన్నత శిఖరం అధిరోహించి తల్లిదండ్రులకు, సమాజానికి, కళాశాల అధ్యాపకులకు మంచి పేరు తెచ్చి పెట్టాలని తహసీల్దార్ ఆకాంక్షించారు. కార్యక్రమంలో ప్రభు చారిటబుల్ డెవలప్‌మెంట్ సొసైటీ నిర్వాహకులు ఆదిమూలపు ప్రభుదాసు, ఐజక్, రవి, షమీమా తల్లిదండ్రులు పాల్గొన్నారు.

వలంటీర్ల సేవలు విలువైనవి

- గిద్దలూరు ఎమ్మెల్యే అన్నా రాంబాబు



వలంటీర్లకు అవార్డులు అందజేస్తున్న ఎమ్మెల్యే అన్నా రాంబాబు

గిద్దలూరు రూరల్: రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన వలంటీర్ల వ్యవస్థకు ప్రజల్లో విశేష ఆదరణ, అభిమానాలు లభించాయని ఎమ్మెల్యే అన్నా రాంబాబు అన్నారు. వలంటీర్లకు వందనం కార్యక్రమంలో భాగంగా పట్టణంలోని నంద్యాల రోడ్డులో గల చీతిరాల కల్యాణ మండపంలో సోమవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొని మాట్లాడారు. ప్రజల సమస్యలను ఎప్పటికప్పుడు తెలుసుకుని పరిష్కరించడంలో వలంటీర్ల సేవలు మరువలేనివన్నారు. ప్రతిఒక్కరూ వలంటీర్ల సేవలను గుర్తించాలన్నారు. ప్రభుత్వం ప్రవేశపెడుతున్న ప్రతి సంక్షేమ పథకాన్ని ప్రజల వద్దకే తీసుకెళ్తూ ఎనలేని సేవలు అందిస్తున్నారని కొనియాడారు. అర్హులైన ప్రతి ఒక్కరినీ గుర్తించి ప్రభుత్వ పథకం అందేలా చేయడంలో వారి పాత్ర కీలకమన్నారు. ఈ సందర్భంగా వలంటీర్లను సేవారత్న, సేవావజ్ర, సేవామిత్ర అవార్డులతో సన్మానించారు. కార్యక్రమంలో నగర పంచాయతీ చైర్మన్ పాముల వెంకటసుబ్బయ్య, కమిషనర్ వై.రామక్రిష్ణయ్య, ఎంపీడీవో ఆకుల రంగనాయకులు, తహసీల్దార్ కె.విజయమ్మ, వైస్ చైర్మన్లు, కౌన్సిలర్లు, సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు, సర్పంచ్‌లు పాల్గొన్నారు.